క్లుప్తంగా

వాన కోసం పూజలు



దేవతలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కౌటాల: మండలంలోని కన్నెపల్లి గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా భజనలు చేస్తూ దేవతలకు నీళ్లతో అభిషేకాలు చేశారు. మండలంలో వర్షం కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వారు వాపోయారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కవిత

దహెగాం: మండల కేంద్రంలో మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కవిత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే మార్పులు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ప్రజలు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్‌కు పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

రెబ్బెన: సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్) బలరాం తండ్రి హన్మంతునాయక్ ఇటీవల మృతిచెందడంతో శుక్రవారం బెల్లంపల్లి ఏరియా ఎస్టీ ఎంప్లాయిస్ అసోషియేషన్ నాయకులు హైదరాబాద్‌లోని తన నివాసంలో డైరెక్టర్ బలరాంను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షుడు తిరుమలరావు, లైజన్ అధికారి వీరన్న, గౌరవ అధ్యక్షుడు మంగిలాల్, ప్రెసిడెంట్ బి.కృష్ణలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్ తల్లి బుచ్చమ్మ కొద్ది రోజుల క్రితం మృతిచెందగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఈ సందర్భంగా బుచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ మద్యం, నాటుసారా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలు నుంచి ఇప్పటి వరకు 20 కేసులు నమోదు కాగా, 12 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 145 లీటర్ల నాటు సారా, 11.34 లీటర్ల దేశీదారు, 16.15 లీటర్ల మద్యం, 40 కేజీల ఆలం, 3 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. నాటుసారా తయారీకి వాడే 3700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాగజ్‌నగర్ పోస్టల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టిని త్వరలో న్యూ ఢిల్లీకి పంపనున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

‘బీజేపీ గెలుపు ఖాయం’

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో బీజేపీ కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు సిర్పూర్‌లోనూ కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. అంతకుముందు పట్టణంలోని సర్‌సిల్క్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు శ్రీశైలం, సత్యనారాయణ, మంజుదర్, జెడ్పీటీసీ రేఖా సత్యనారాయణ, విశ్వేశ్వర్రావు, మల్లయ్య, వెంకటేష్ బాలకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు నీటి కష్టాలు..!

- మరమ్మతులకు నోచుకోని వట్టివాగు ప్రాజెక్టు కాలువలు
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- చివరి ఆయకట్టుకు నీరు చేరని వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



కాలువలో పూడిక తీస్తున్న రైతులు (ఫైల్)



సిమెంట్ లైనింగ్ కూలిపోయిన కాలువ

ఆసిఫాబాద్‌రూరల్: వట్టివాగు ప్రాజెక్టు దిగువన వరి సాగు చేసిన రైతులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రాజెక్టులో నిండా నీరున్నా కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు కింది ఆయకట్టుకు చేరని పరిస్థితి నెలకొంది. దీంతో సాగు చేసిన పంటలను రక్షించుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రాజెక్టు నిర్మించి 19 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో కాలువలు సిమెంట్ లైనింగ్ కోల్పోయి, పూడిక, పిచ్చి మొక్కలు, తుంగతో నిండిపోయి అధ్వానంగా మారాయి.

నీరు ఉన్నా నిరుపయోగం..

వట్టివాగు ప్రాజెక్టు పనులు 1998లో ప్రారంభించి 2001లో పూర్తి చేశారు. 2.98 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ జలాశయం 27వేల ఎకరాలకు సాగు నీరందించేలా నిర్మించారు. ప్రాజెక్టు నిర్మించి 19 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో జలాశయంలో నీరు ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కింది ఆయకట్టుకు నీరు అందడం లేదు. దీంతో ప్రస్తుతం ప్రాజెక్టులో 2 టీఎంసీల నీరు ఉన్నా పంటలకు అందించలేని దుస్థితి నెలకొంది. వేల ఎకరాలకు నీరందించే సామర్థ్యం ఉన్న ప్రాజెక్టు కింద ప్రస్తుతం రైతులు కేవలం 1000 ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో పంటలకు నీరు అందడం లేదు.

పూడికతీత పనుల్లో రైతులు..

ప్రాజెక్టు దిగువన చివరి ఆయకట్టు గ్రామాలు పర్శనంబల, నక్కలగూడ, పుంజుమేరగూడ రైతులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేల రూపాయలు ఖర్చు చేసి వరి పంట సాగు చేసిన రైతులకు గత నెల నుంచి వర్షాలు లేకపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదు. కాలువలు సరిగ్గా లేక చివరి ఆయకట్టు రైతుల వరకు నీరు రావడం లేదు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులంతా ఏకమై కాలువల్లో పేరుకుపోయిన నాచు, పిచ్చి మొక్కలు తొలగించారు. పంట సాగు కోసం వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చివరి దశలో నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని కాలువలు

ప్రాజెక్టుకు రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటిలో కుడి ప్రధాన కాలువ 21.6 కిలోమీటర్లు ఉండగా, ఎడమ కాలువ 7 కిలోమీటర్లు ఉంది. వీటి కింద మరో 19 చిన్న కాలువలు ఉన్నాయి. డీ2 నుంచి డీ8 కాలువలు సిమెంట్ లైనింగ్ కోల్పోయి పూర్తిగా పూడికతో నిండి పిచ్చి మొక్కలు, తుంగతో శిథిలావస్థకు చేరాయి. ప్రాజెక్టు కింద ఉన్న తూములు దెబ్బతినగా గేట్లు, రాడ్లు శిథిలావస్థకు చేరాయి. అయినా మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు కింది వరకు పారడం లేదు. శిథిలమైన కాలువలు, అడుగడుగునా లీకేజీల వల్ల ప్రాజెక్టులో నీరు ఉన్నా అన్నదాతలకు ప్రయోజనం లేకుండా పోతోంది.

> **ప్రతిపాదనలు పంపించాం**
>
> ప్రాజెక్టు కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడుతాం. ఎండాకాలంలో ఈజీఎస్ ద్వారా ఉపాధి కూలీలతో కొంత మేర పూడిక పనులు చేయించాం
>
> – జానీ, ఏఈ

ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు జిల్లాలో సజావుగా జరిగేలా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణను అధికారులు సమన్వయంతో పనిచేసి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తరలింపు, ఆయా నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చడం పూర్తి పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జరుగుతుందని, ఈ సమయంలో ప్రతీ అంశాన్ని వీడియో చిత్రీకరించనున్నట్లు వివరించారు.

‘సద్దుల బతుకమ్మ’కు ఘనంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న జీఎం రవి ప్రసాద్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఏరియా జీఎం రవి ప్రసాద్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల కోసం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంతో పాటు, మాదారంలోని రామాలయం ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వేడుకలకు హాజరయ్యే సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అందంగా అలంకరించిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: డీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫలితాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు https:// www. bse. telangana. gov. in వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చన్నారు. నవంబర్ 6 వరకు రీకౌంటింగ్‌కు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

పూనగూడలో వైద్య శిబిరం



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని పూనగూడ గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉన్న వారికి మలేరియా పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించారు. నిల్వ నీరు ఉన్న చోట యాంటీ లార్వా మందులు వేశారు. దోమల వ్యాప్తి అరికట్టేందుకు మందులు పిచికారీ చేశారు. అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఏఎన్ఎం పుష్పలత, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార పాట ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిపై అభిమానంతో తెలంగాణ ఉద్యమ గాయకుడు, పార్టీ నాయకుడు ఇర్ఫాన్ రాసి పాడిన పాట సీడీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కోవ లక్ష్మి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కళాకారులతో బీఆర్ఎస్‌కు ఉన్న అనుబంధం విడదీయరానిదన్నారు. తనపై అభిమానంతో ఎన్నికల ప్రచారం కోసం పాట రాసి, పాడడం హర్షణీయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

‘వైఎస్సార్‌టీపీతోనే అభివృద్ధి సాధ్యం’



మాట్లాడుతున్న ఆనందీశ్వర్

జైనూర్: వైఎస్సార్‌టీపీతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా యువజన నాయకుడు ఆనందీశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌టీపీ ఎమ్మెల్యే టికెట్ సీనియర్లకే కేటాయిస్తుందని పేర్కొన్నారు. పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు.

శ్యాంనాయక్ వాహనం తనిఖీ

జైనూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజ్మీరా శ్యాంనాయక్ వాహనాన్ని పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ నుంచి జైనూర్ వస్తుండగా పోలీసులు జైనూర్ శివారులో శ్యాంనాయక్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు.

ప్రయాణం.. ప్రమాదకరం



కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌కు వెళ్లే మార్గమధ్యలో ఉన్న కల్వర్టు అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల్లో కుమురం భీం వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు



దహెగాం: కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కెరమెరి: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం దుర్గాదేవి శ్రీలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద నిత్యాన్నదానం నిర్వహించారు.

హనుమాన్‌నగర్‌లో..

మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ నిర్వహించారు. కళశపూజ, గణపతిపూజ, అంగపూజ, గౌరీ పూజ, కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మను వేడుకున్నారు.

దహెగాంలో..

దహెగాం: శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి శుక్రవారం సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చారు. స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేశారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఆలయాలు, కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన దుర్గ, శారదామాత మండపాల వద్ద మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వాణిజ్య దుర్గా మండలి వద్ద శుక్రవారం అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు

కాగజ్‌నగర్‌టౌన్: శరన్నవరాత్రుల సందర్భంగా వివిధ మండపాల వద్ద ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని సర్‌సిల్క్, దుర్గ మిత్రమండలి, నౌగంబస్తి ఓం శ్రీ దుర్గా మండలి, శ్రీ ఆరాధ్య దుర్గ మండలి వద్ద ఎమ్మెల్యే కోనప్ప, ఆయన సతీమణి రమాదేవితో కలిసి పూజలు చేశారు. వారి వెంట కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కోనేరు వంశీ, సతీమణి మధులిక, స్థానిక కౌన్సిలర్లు ఉన్నారు.

రెబ్బెన: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. గోలేటి విలేజ్‌లోని జగదాంబ ఆలయంలో, గోలేటి విలేజ్ బస్టాండ్ ధారావత్ దుర్గా మండలి వద్ద భక్తులు దుర్గామాతకు కుంకుమ పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆరవ రోజు అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ఖైరిగూడలో దర్శించుకున్న జీఎం..

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ ఖైరిగూడ ఓసీపీ ఆవరణలో ఉన్న దుర్గామాతను దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ పూజలు, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్‌లతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



కెరమెరి: విద్యానగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఆసిఫాబాద్: గాంధీ చౌక్ మండపం వద్ద..



కెరమెరి: హనుమాన్‌నగర్‌లో..



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప



రెబ్బెన: ఇందిరానగర్ ఆలయంలో..



ఆసిఫాబాద్: మహాలక్ష్మి ఆలయంలో..



రెబ్బెన: ఖైరిగూడ ఓసీపీ మండపంలో..



దహెగాం: పూజలో పాల్గొన్న మహిళలు

బతుకమ్మ సంబరాలు



పైకాజీనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. 7వ రోజు సంబరాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్, పైకాజీనగర్, జన్కాపూర్‌తో పాటు పలు కాలనీల్లో మహిళలు తెలంగాణ సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.